క్లుప్తంగా

శ్రీముఖలింగంలో భక్తుల సందడి



స్వామివారి సన్నిధిలో భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శ్రావణ మాసం మూడో ఆదివారం స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వరుసుగా రెండు రోజులు సెలవులు రావడంతో జిల్లా నలుమూలలతోపాటు పక్క జిల్లా అయిన విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా, పర్లాఖిముండి, తెలంగాణ, చత్తీష్‌ఘడ్ తదితర రాష్ట్రాలు నుంచి వచ్చారు. ముందుగా పవిత్ర వంశధార నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ప్రవచనాలు చెబుతున్న స్వరూపానంద స్వామి

సారవకోట: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత పెరగాలని శ్రీనివాస మంగాపురంలో గల వశిష్ఠ ఆశ్రమం, లలితా పీఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో 97వ ఆధ్యాత్మిక సత్సంగాన్ని ఆదివారం నిర్వహించారు. దేశ సంస్కృతి ఎంతో గొప్పదన్నారు. వచ్చే ఏడాది శ్రీనివాస మంగాపురంలో గల శ్రీలలితా పీఠం రజతోత్సవాలను నిర్వహిస్తామన్నారు. గోవిందరావు, అల్లు రామయ్య ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మెండ సన్యాసిరావు, జాడ మోహన్‌రావు, పిట్ల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ దుర్గాప్రసాద్

నరసన్నపేట: స్థానిక ఎస్‌ఐగా చింతలపూడి దుర్గాప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరిసీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై నరసన్నపేటకు వచ్చారు. నరసన్నపేటలో ఎస్‌ఐగా పనిచేసిన అశోక్‌బాబు జలుమూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సమావేశం నిర్వహించి నరసన్నపేట పరిస్థితుల గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా పెద్దకోట

ఎల్.ఎన్.పేట: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్.ఎన్.పేట మండలం డొంకలబడవంజ గ్రామానికి చెందిన పెద్దకోట వెంకటరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారని వెంకటరావు తెలిపారు. కార్యవర్గ ఎన్నికలో రాష్ట్ర కోశాధికారి జె శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు ఎస్.గోవిందరావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు, ఎం.రామకృష్ణ, యు.వెంకటరావు తదితరులు హాజరయ్యారు. వెంకటరావుకు కార్యవర్గ సభ్యులతోపాటు పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



నూకాంబికాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక బండివీధి ఎదురుగా మెయిన్ రోడ్డుపై ఉన్న నూకాంబికాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ముగ్రాటలు సమర్పించారు. అర్చకులు ఇప్పిలి రమణ వేకువ నుంచి భక్తులతో పూజలు చేయించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాగునీరు విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న అధికారులు, రైతులు

పొందూరు: సంతకవిటి మండలంలోని కావలి–గోకర్ణపల్లి సమీపంలోని కాలువలో ఇరిగేషన్ అధికారుల సమక్షంలో మండల రైతులు షట్టర్లను ఎత్తి సాగునీటిని ఆదివారం విడుదల చేశారు. ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీఈ మురళీమోహన్, ఏఈ రవికుమార్ సమక్షంలో మండలానికి చెందిన రైతులు సాగునీటిని విడుదల చేశారు. కింతలి, కనిమెట్ట, తోలాపి, సింగూరు, బొడ్డేపల్లి, గోకర్ణపల్లి, గొరింట తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందుబాటులోకి వచ్చింది.



ప్రత్యేక చట్టం తీసుకురావాలి

కలకత్తా ఘటనతో మహిళా ఉద్యోగులకు ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని మరోసారి రుజువైంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి. దీని కోసం ఒక జీఓ ఇవ్వాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు ఎదురైతే ఉద్యోగులు పూర్తిస్థాయిలో సర్వీస్ అందించలేరు.

– పల్లి లక్ష్మీప్రసన్న, మెడికల్ అధికారి, అచ్చుతాపురం పీహెచ్‌సీ, జలుమూరు మండలం



రక్షణ కల్పించాలి

ఆపదలో ఉన్న క్షతగాత్రులకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడుతున్నాం. ఒక్కోసారి మా కుటుంబం, పిల్లలకు దూరం ఉండాల్సి వస్తుంది. వైద్య సేవలే పరమావధిగా విధులు నిర్వహిస్తున్నాం. ఇలా సేవలందిస్తున్న వైద్యులపై దాడులు చేయడం దుర్మార్గం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాకు రక్షణ కల్పించాలి. వైద్య, ఆరోగ్య సిబ్బందికి భద్రత పెంచాలి.

–పావని, స్టాఫ్‌నర్స్, హిరమండలం పీహెచ్‌సీ, హిరమండలం మండలం



వణికిస్తున్న విష జ్వరాలు

అంటువ్యాధులకు మూలం అపారిశుద్ధ్యమే. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, అంటువ్యాధులను నిరోధించాలని జిల్లా కలెక్టర్ పదేపదే ఆదేశిస్తున్నా.. ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడికక్కడ చెత్త పోగులు దర్శనమిస్తున్నాయి. దోమలు, ఈగలు వృద్ధిచెందుతున్నాయి. విష జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

- ఎక్కడి చెత్త అక్కడే
- వృద్ధి చెందుతున్న ఈగలు, దోమలు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ సామజిక ఆస్పత్రిలో రోగులతో నిండిన బెడ్లు



నరసన్నపేట: పాలకొండపేటలో రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్ప



సారవకోటఃబుడితి, అవలింగి, చీడిపూడి గ్రామాల కూడలిలో నిల్వ ఉన్న వర్షం నీరు



ఆమదాలవలస: లక్ష్మీనగర్ వీధి శివారులో వేస్తున్న చెత్త



కొత్తూరు: ఎస్‌ఎస్ కాలనీ వద్ద ప్రవహిస్తున్న మురుగు నీరు



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త కుప్ప



ఎల్.ఎన్.పేట: తురకపేట సెంటర్‌లో వ్యాపారులు పడేసిన వ్యర్థాలతో కలుషితం అవుతున్న అసర్లవాని చెరువు

సారవకోట: మండలంలోని నిత్యం రద్దీగా ఉండే బుడితి, అవలింగి, చీడిపూడి గ్రామాల జంక్షన్‌కు సమీపంలో వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉంటుంది. బుడితి గ్రామంలో మురుగు నీటి కాలువ అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో బస్టాండ్ సమీపంలో మురుగు నీరు నిల్వ ఉంటుంది. మేదర వీధిలో కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది.

కొత్తూరు: కొత్తూరు సీహెచ్‌సీ, మెట్టూరు, కురిగాం పీహెచ్‌సీలతోపాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకు సుమారు 200 మంది జ్వరబాధితులు బారులు తీరుతున్నారు. అడ్డంగి, గొట్టిపల్లి, ఆల్తి గిరిజన గ్రామాలకు చెందిన వారితో పాటు మైదాన ప్రాంతాల్లో గత నెల రోజుల్లో సుమారు 20 మంది వరకు మలేరియా జ్వరాల బారిన పడ్డారు. నెల రోజుల్లో ఐదు డెంగీ జ్వరాలు నమోదయ్యాయి.

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రానికి సమీపంలోని రోడ్డు పక్కనే చెత్తకుప్పలు పేరుకుపోయాయి. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించాల్సి ఉన్నప్పటికీ అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నరసన్నపేట: ఉర్లాం పీహెచ్‌సీ పరిధిలో దేవాది, గోకయ్యవలస తదితర గ్రామాల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మాకివలస పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో జ్వరాలు ఉన్నాయి. నరసన్నపేటలో కూడా జ్వరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుంది. ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ 30 నుంచి 40 వరకు జ్వరపీడుతులు వస్తున్నారు.

హిరమండలం: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లోనూ డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. వర్షం పడితే వీధుల్లోకి మురుగునీరు పారుతుంది. తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో చెత్త వేయడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో దారుణంగా తయారైంది. సుబలాయలో రోడ్డు పక్కన చెత్తను పోగులుగా వేస్తుండడంతో దుర్వాసన వస్తోంది.

పాతపట్నం: మండలంలోని పలు పంచాయతీల్లో చెత్త కుప్పలు ఎక్కడికక్కడే దర్శినమిస్తున్నాయి. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని నరసింహనగర్, గణేష్‌నగర్, ఆల్‌ఆంధ్రా రోడ్డు, యశోదనగర్, కిరణ్మయి వీధి, అమ్మవారి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బలాజీనగర్, పట్టణ శివారులో ఉన్న నూతన లేఅవుట్లలో ఖాళీగా ఉన్న స్థలాలు అధికంగా ఉన్నాయి. వీటిలో మురుగునీరు నిల్వ ఉంటుంది. పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి రోజుకు 200 ఓపీ ఉంటే.. ఇందులో 50 మంది వరకు జ్వరలతో బాధపడుతున్న వారు వస్తున్నారని వైద్యులు అంటున్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని అమ్మ పంక్షన్ హాల్ ఎదురుగా మురుగునీరు, వర్షం నీరు చేరి అధికంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మురుగునీరు రహదారిపై నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. లక్ష్మీనగర్ వీధి శివార్లలో చెత్తపోగులు వేయడంతో దుర్వాసనతో ఆ ప్రాంత వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి వనరుల్లో క్లోరినేషన్ తరచూ చేపట్టాలి. మురుగు నీటిలో బాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెందుతాయి. ఆస్పత్రికి ఎక్కువగా జ్వరం, విరోచనాలతో ఇబ్బంది పడేవారు వస్తున్నారు. తాగునీటిని మరిగించి తాగాలి

– డాక్టర్ ఎస్.కృష్ణారావు, సూపరిటెండెంట్, పాతపట్నం సీహెచ్‌సీ



నరసన్నపేట: ఉర్లాం చెరువు వద్ద వాటర్ ట్యాంకు సమీపంలో చెత్త కుప్పలు



హిరమండలం: సుబలాయలో రహదారి పక్కనే చెత్త పోగు



హిరమండలం: తంప ఉన్నత పాఠశాల పక్కనే చెత్త కుప్ప



పాతపట్నం: సీహెచ్‌సీలో ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

పనుల నాణ్యత పరిశీలన



రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న తనిఖీ బృందం

మెళియాపుట్టి: మండలంలో పలుచోట్ల మెటీరియల్ పనుల నాణ్యతను ఎస్ఆర్పీ రామారావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ద్వారా సిబ్బంది ఆదివారం పరిశీలించారు. బీటీ రోడ్డు నుంచి కొదు కొళిగాం గ్రామంలో నిర్మాణంలో ఉన్న (ఐటీడీఏ నిధులతో నిర్మించిన తారు రోడ్డు) రహదారిని పరిశీలించారు. డీఆర్పి మేనకా రుద్ర ఆధ్వర్యంలో మెళియాపుట్టి ఉపాధి హామీ కార్యాలయంలో వర్షం నీరు ఇంకింపజేయడానికి ఉపయోగపడే రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. మెటీరియల్ పనుల్లో నాణ్యతాలోపాలు ఉండకూడదని తనిఖీ బృంద సభ్యులు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఈసీ ఆదినారాయణ రెడ్డి, టీఏలు తిరుపతిరావు, రవికుమార్, పలువురు ఆడిట్ సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో మీరిచ్చిన సందేశం ఏంటి?

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ఒకేరోజు అన్ని గ్రామ పంచాయతీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించినప్పటికీ.. ప్రజలకు ఇవి ఉపయోగకరం కాదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. గతంలో ఎన్నడూ నిర్వహించని విధంగా గ్రామ సభలు నిర్వహించామని కూటమి ప్రభుత్వ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. అధికారులందరూ ప్రతి గ్రామ సభకు హాజరుకావడానికి వీలు కాకపోవడం వల్ల.. ప్రజలకు ఇవ్వాల్సిన సందేశం, ప్రజల నుంచి ఆయా గ్రామాల సమస్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఒకేరోజు గందరగోళంగా గ్రామ సభలు నిర్వహించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహిస్తే ఉపాధి హామీ పథకంలో చేయాల్సిన పనులకు సంబంధించిన వివరాలు తెలియజేయడానికి సంబంధిత శాఖ అధికారులు హాజరవడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయమన్నారు. గ్రామసభల ద్వారా ప్రజలకు ఉపయోగపడిన కార్యక్రమాలు చేయాలన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి, వాటిని గాలికి వదిలేశారన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆమదాలవలస: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేసి ప్రాణదాతలుగా ప్రతి ఒక్కరూ నిలవాలని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో వినోద్ కిడ్స్ ఆస్పత్రి సహకారంతో కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్, ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 92 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యులు కూర్మాన వినోద్ కుమార్, ప్రముఖ వైద్యులు పి.తాతయ్యలు, సి.హెచ్.సుధాకర్, సీపాన హేమమోహన్, కృత్విక్ ఫౌండేషన్ సైన్యం, వాయుపుత్ర జిమ్ కోచ్ శ్రీనివాసరావు, బమ్మిడి రాము, షణ్ముఖ, వి.లక్ష్మణరావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



25 ఏఎంవి 62: అవగాహన కల్పిస్తున్న ఆప్తాలమిక్ అసిస్టెంట్ వసంతరావు

పొందూరు: మరణించిన తర్వాత నేత్రదానం చేయడంతో పునర్జన్మ పొందవచ్చని ఆప్తాలమిక్ అసిస్టెంట్, శ్రీకాకుళం రోటరీ క్లబ్ సభ్యులు ఎస్.వసంతరావు అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాటశాలలో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. నేత్రదానంతో ఇద్దరికి ప్రపంచాన్ని చూసే అవకాశం కల్పించిన వారమవుతామన్నారు. మరణించిన 6 గంటలలోగా నేత్రాలను భద్రపరచాలని సూచించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

సాక్షి ఎఫెక్ట్...

సరుబుజ్జిలి: మండలంలో పనిచేయని చెత్త సంపద కేంద్రాలను వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామని ఈఓపీఆర్డీ జె.ఆనందరావు తెలిపారు. నెరవేరని లక్ష్యం శీర్షికతో శనివారం ప్రచురితమైన కథనానికి ఆదివారం స్పందించారు. అన్ని చెత్త సంపద తయారీ కేంద్రాల్లో వర్మికం పోస్ట్ తయారుచేస్తామన్నారు. షెడ్డులకు మరమ్మతులు చేస్తామని వెల్లడించారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులేవీ?



జి.సింహాచలం

హిరమండలం: రైతు సేవా కేంద్రాల ద్వారా డీఏపీ, యూరియా తదితర ఎరువులు అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లభ్యంకాక రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తెలియజేశారు. ప్రైవేట్ వ్యాపారులకు, సొసైటీలకు ఎరువులు కేటాయించిన ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు సరిపడ కేటాయింపులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు బస్తాకు రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. రెండు డీఏపీ భస్తాలు కావాలంటే అవసరం లేకపోయినా గుళికలు ప్యాకెట్ తీసుకుంటేనే ఎరువు ఇస్తామని మరికొంత మంది వ్యాపారులు చెబుతుండడంతో రైతులు చేసేది కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రైతు సేవా కేంద్రాలకు అవసరమైన ఎరువులను కేటాయించాలన్నారు.

కుప్పిలికి జాతీయ స్థాయి బహుమతి

ఆమదాలవలస: హైదరాబాద్‌కు చెందిన నవ భారత నిర్మాణ సంస్థ స్వాతంత్ర్య సమర యోధుడు అల్వాల బాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇటీవల ఆన్‌లైన్లో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఆమదాలవలస పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావు రచించిన 'సమరానికి ఊపిరై' అనే కవితకు తృతీయ బహుమతి లభించింది. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు సూరేపల్లి రమేష్ కుమార్ ఆదివారం రాజారావు మాస్టార్‌కు సమాచారం అందించారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సిద్ధమవుతున్న వినాయక మండపాలు



మండపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీరు ఎర్రయ్య

నరసన్నపేట: వినాయక చవితి నవరాత్రులు సమీపిస్తుండటంతో మండపాలు సిద్ధమవుతున్నాయి. మేజరు పంచాయతీ నరసన్నపేటలోని కొత్తవీధి–నాయుడు వీధుల్లో వినాయక నవరాత్రులు ఏటా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. దీంట్లో భాగంగా ఈసారి కూడా సినీ సెట్టింగ్‌లతో మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. విశ్రాంత ఆర్డీఓ పీరు ఎర్రయ్య ఆధ్వర్యంలో మండపాన్ని తయారు చేస్తున్నారు. గత 28 ఏళ్లుగా ఎర్రయ్య ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ ఈ సారి మరింత పకడ్బందీగా నవరాత్రులు చేస్తున్నామని, ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేశామని ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సినీమా నటుడు పీరు శ్రీను (ప్రభాస్ శ్రీను) పాల్గొంటారన్నారు. విగ్రహాన్ని అనకాపల్లి నుంచి తీసుకువస్తున్నట్లు తెలిపారు. రెండు వీధులకు చెందిన భక్తులు పాల్గొంటారన్నారు.

పని దినాలను వృథా చేయొద్దు

ఆమదాలవలస: రాష్ట్ర విద్యా శాఖ, అధికారులు స్వీయ మదింపు పరీక్షలను ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ఏకంగా 7 రోజులపాటు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం వల్ల పాఠశాల పని దినాలు వృథా అవుతాయని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరం వరకు గల ఫార్మేటివ్ మదింపు పరీక్ష విధానం మూడు పని దినాల్లో నిర్వహించేవారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఫార్మేటివ్ ఎస్సెస్‌మెంట్‌గా పేరు మార్చి స్వీయ పరీక్ష విధానం (సెల్ఫ్ అసెస్మెంట్) పేరుతో నిర్వహిస్తున్న ఈ పరీక్షలను రోజుకి ఒక సబ్జెక్టు చొప్పున మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు కేవలం ఒక గంట మాత్రమే నిర్వహించాలని రాష్ట్ర అధికారులు తెలపడంతో ఏడు రోజులు బోధనకు ఆటంకం కలుగుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరీక్షలను ఒకటి నుంచి ఐదు తరగతులకు ఐదు రోజులు, 6 నుంచి 10వ తరగతి వరకు ఏడు రోజులు జరపాలని నిర్ణయించడం అశాస్త్రీయమన్నారు. ఈ విధంగా నిర్వహించడం కారణంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల కాలాన్ని వృథా చేయడమేనన్నారు. గతంలో మాదిరిగా రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ఉదయం మధ్యాహ్నం నిర్వహించి మూడు పని దినాల్లో సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు డీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. విద్యాప్రవేశమని, శిక్షా కా సప్తాహ్ అని అనవసరమైన కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడం వల్ల బోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. ఇటువంటి విధానాలకు స్వస్తి పలికి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేసి ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై గిరిజనులకు అవగాహన



పాతపట్నం: మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ డీకే పాత్రో

పాతపట్నం: గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయంపై మెలకువలు నేర్చుకోవాలని హైదరాబాద్‌కు చెందిన రిసోర్స్ పర్సన్ డీకే పాత్రో అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలోని బ్రెడ్స్ కార్యాలయంలో అపీల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయ పంటలపై శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ పద్ధతులు నేర్చుకోవాలన్నారు. జీవామృతం కషాయాల తయారీ, జీడి పంటలు పండించే విధానం, తెగుళ్ల నివారణ చర్యలు, బహుళ పంటల విధానం ,ఎల్లప్పుడూ పంటలు పండించే విధానాలపై చర్చించారు.